రోడ్డు ప్రమాదంలో పంచాయతీ వార్డు సభ్యుడు దుర్మరణం

ఉంగుటూరు: మండలంలోని జాతీయ రహదారిపై కైకరం వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పంచాయతీ వార్డు సభ్యుడు బలే బులిరాజు (42) మృతిచెందారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిడమర్రు మండలం తోకలపల్లికి చెందిన వార్డు సభ్యులు బుల్లి రాజు, ఆయన భార్య మల్లేశ్వరి ఉదయం ద్విచక్రవాహనంపై ఏలూరు వెళ్లారు. తిరిగి వస్తుండగా కైకరం బిసి హాస్టల్ సమీపంలోకి రాగానే ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్న కారు వీరిని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు బాయినెట్‌లో చిక్కుకున్న భార్య మల్లీశ్వరిని కారు కొంత దూరం వరకూ ఈడ్చుకుపోయింది. ఈ ఘటనలో బులిరాజు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్థానికులు, పోలీసుల సహకార ంతో హైవే అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. బులి రాజుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. ప్రస్తుతం ఆ కుటుంబం ఛానమిల్లిలో ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.

ఆదుకుంటారా.. వదిలేస్తారా..!

వర్షాభావంతో దెబ్బతిన్న పంటలపై ప్రభుత్వం మౌనం

పంట నష్టం నమోదుకు వెలువడని ఆదేశాలు

జిల్లాలో 15 వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

ఎకరాకు రూ.20 వేలకు పైగా పెట్టుబడులు

ప్రభుత్వ తీరుపై రైతుల్లో తీవ్ర ఆగ్రహం



చింతలపూడి మండలంలో సాగునీరు లేక ఎండిన వరిపైరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వర్షాభావంతో దెబ్బతిన్న ఖరీఫ్ పంటల రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందా.. లేక ఎప్పటిలాగా వదిలేస్తుందా..? అన్న ఆందోళన అన్నదాతల్లో నెలకొంది. దెబ్బతిన్న పంటలకు సంబంధించి ఇప్పటివరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలూ రాకపోవడంపై వారిలో తీవ్రచర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత ఖరీఫ్‌లో వర్షాలు పడకపోవడంతో మెట్టప్రాంతాల్లో చెరువులకింద, వర్షాధారంగా వేసిన పంటలు పెద్దఎత్తున దెబ్బతిన్నాయి. చింతలపూడి, చాట్రాయి, కుక్కునూరు, వేలేరుపాడు వంటి అనేక మండలాల్లో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. పంటలు దెబ్బతిన్న రైతులు లబోదిబోమంటున్నారు. ఏలూరు జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో రైతులు వరిపంట సాగుచేశారు. వర్షాలు సరిగా పడకపోవడంతో పెద్దఎత్తున నీటి ఎద్దడి ఏర్పడి వరిపంటతోపాటు, పత్తిపంట సైతం దెబ్బతింది. ఒక్క చింతలపూడి మండలంలోనే ఐదువేల ఎకరాలకుపైగా వరి పంట దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు. మిగిలిన మండలాల్లోనూ అదే పరిస్థితినెలకొంది. జిల్లాలో దాదాపు 15వేల ఎకరాలకు పైగా వరిపంట దెబ్బతిన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.20వేలకుపైగా పెట్టుబడి పెట్టారు. దెబ్బతిన్న పొలాలు పశువుల మేతగా మారిపోయాయి. పంటలు దెబ్బతిని రైతులు కష్టాల్లో ఉన్నా ప్రభుత్వంలోగానీ, అధికారుల్లోగానీ చలనం లేకుండాపోయింది. దెబ్బతిన్న పంటలకు సంబంధించి రైతులను ఏవిధంగా ఆదుకుంటారో ప్రభుత్వం కనీస ప్రకటన కూడా చేయలేదు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి నష్టపరిహారం అంచనాలకు ఇప్పటి వరకూ ఎలాంటి ఆదేశాలూ వెలువడలేదు. దెబ్బతిన్న పంటలను పరిగణలోకి తీసుకుని రైతులను ఆదుకునే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా అన్న చర్చ రైతుల్లో నడుస్తోంది. ఏ ఏడాది దెబ్బతిన్న పంటలకు అదే ఏడాది నష్టపరిహారం ఇస్తామంటూ ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. కానీ ఇప్పటి వరకూ దెబ్బతిన్న పంటలకు సంబంధించి ఎన్యూమరేషన్ ఎందుకు పూర్తిచేయలేదో అర్థంకావడం లేదు. చింతలపూడి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఇప్పటికే రైతు సంఘాలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనంలేదు. గతంలో ఎన్నడూలేని విధంగా ఖరీఫ్‌లో పెద్దఎత్తున పంటలు దెబ్బతిన్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదంటూ రైతుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ఆదుకోకపోతే రబీసాగుకు రైతులు ఏవిధంగా సన్నద్ధంకావాలంటూ అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. తమది రైతుప్రభుత్వమంటూ గొప్పలు చెబుతున్న పాలకులు వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నా ఎందుకు పట్టించుకోవడం లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. స్థానిక ఎంఎల్‌ఎలు కూడా దెబ్బతిన్న పంటలకు సంబంధించి మౌనం వహించడం దేనికి సంకేతమో అర్థంకావడం లేదు. కనీసం పంటలను పరిశీలించేందుకు కూడా ప్రజాప్రతినిధులు వెళ్లకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, నష్టపరిహారం అంచనాలు వెంటనే పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో వేచిచూడాల్సి ఉంది.

సిపిఎం చాట్రాయి మండల కార్యదర్శి భాస్కరరావు మృతి

ప్రముఖులు నివాళి - నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి - చాట్రాయి

నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

సిపిఎం మండల కార్యదర్శి కొలికిపోగు భాస్కరరావు(55) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. గత కొన్ని రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు ఇటీవల గుంటూరులోని ఓ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందారు. ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తున్న ఆయన పార్టీ సిద్ధాంతాలు, భావాలు నచ్చి సుమారు 20 ఏళ్ల క్రితం కార్యకర్తగా చేరారు. అప్పటి నుంచి పార్టీలో విశేష సేవలందిస్తూ అంచలంచెలుగా ఎదిగి ప్రస్తుతం మండల కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈయనకు భార్య మయూత, ముగ్గురు కుమారులున్నారు. వీరందరికీ పార్టీ సిద్ధాంతాలంటే అమితమైన అభిమానం. భాస్కర్‌రావు రెండో కుమారుడు లెనిన్ ప్రస్తుతం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు. పెద్దకుమారుడు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. చిన్నకుమారుడు ఇంటివద్దే ఉంటున్నారు. భాస్కర్‌రావు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, పార్టీ పిలుపులను విజయవంతంగా నిర్వహించడంలో ఎంతో కృషి చేసేవారు. ఆయన మృతితో పార్టీలో, కుటుంబ సభ్యుల్లో తీవ్రవిషాదం నెలకొంది.

మృతిచెందిన భాస్కర్‌రావు

బుధవారం చాట్రాయిలో ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భాస్కర్‌రావు మృతికి పార్టీ నాయకులు, వివిధ కార్మిక, ప్రజాసంఘాల నేతలు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సిపిఎం జిల్లా కమిటీ సంతాపం

భాస్కర్‌రావు మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి సంతాపం తెలిపారు. పార్టీ సభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలిపారు. భాస్కర్‌రావు మృతి పార్టీకి, వారి కుటుంబ సభ్యులకు తీరనిలోటు అని పేర్కొన్నారు.

ఎండిన వరిచేలో ద్విచక్ర వాహనాలు నడిపి నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి



ఎండిన వరిచేలో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న రైతులు, నాయకులు

వర్షాభావంతో పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, చింతలపూడిని కరువు మండలంగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ మండలంలోని సమ్మెటవారిగూడెంలో రైతులు, రైతుసంఘం ఆధ్వర్యాన ఎండిన వరిచేలో ద్విచక్రవాహనాలు నడిపి నిరసన తెలిపారు. అనంతరం రైతుసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు రైతులు ధర్నా నిర్వహించారు. కరువు వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కరువు వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కష్టపడి సాగుచేసిన పంట ఎండిపోవడంతో రైతుల కంట కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టాల నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు. ఇదేనా రైతుకు భరోసా కల్పించడం అని ప్రశ్నించారు. ఎకరాకు రూ.25 వేల నుండి రూ.30 వేల వరకూ పెట్టుబడి పెట్టారని చెప్పారు. వరి పంట పొట్ట, ఈనిక దశకు చేరుకున్నాక పూర్తిగా ఎండిపోయిందని చెప్పారు. గింజ కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తయ్యి ఉంటే రైతులకు ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయ ప్రణాళిక లేకపోవడమే కారణమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పంట నష్టం నమోదుకు ఆదేశాలివ్వాలని కోరారు. ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకం అమలు చేయాలన్నారు. పంటలు నష్టపోయిన రైతుల రుణాలు మాఫీ చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ కార్యదర్శి చిట్టూరి అంజిబాబు, రైతు రావెళ్ల హనుమంతరావు మాట్లాడుతూ మండలంలోని చింతలపూడి, సమ్మెటవారిగూడెం, పోతునూరు, మల్లాయగూడెం, ప్రగడవరం తదితర గ్రామాల్లో ఐదు వేల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిని, రైతులు నష్టపోయి దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

అనంతరం తహశీల్దార్ ఎ.కృష్ణజ్యోతికి రైతులు, రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘానికి సిపిఐయం మండల నాయకులు ఎస్.సూర్యకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి డి.సత్యనారాయణ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు జి.తులసీరావు, గన్నమనేని శ్రీనివాసులు, సయ్యద్ హుస్సేన్, గజ్జల సత్యనారాయణ, జి.గంగాధర్‌రావు, చాపలమడుగు సత్యనారాయణ, రామిశెట్టి వెంకటేశ్వరరావు, సంతు సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రేస్‌కుమారి

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్‌కుమారి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులకు ఎలాంటి రుసుమూ ఉండదని, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాప్రయోజిత సేవల శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్‌కుమారి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా మంగళవారం పెదవేగి మండలం కొప్పాకలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ గ్రేస్‌కుమారి మాట్లాడుతూ కక్షిదారుల సత్వర కేసుల పరిష్కారం నిమిత్తం, ఉచిత న్యాయ సహాయం అందించడం, చట్టాలపైన అవగాహన కల్పించేందుకు లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం రూపొందించారన్నారు. ఈ చట్టంలో భాగంగా శాశ్వత లోక్ అదాలత్ ఏర్పాటు చేశారని, ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో విద్య, వైద్య, పోస్టల్, బీమా, రియల్ ఎస్టేట్, రవాణా, పారిశుధ్యం, బ్యాంకింగ్, ఎన్ఆర్ఇజిఎస్, టెలికం సేవల్లో విచారణ జరుగుతుందని ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో ఇచ్చేతీర్పులకు అప్పీలు ఉండదని అలాగే ఎలాంటి రుసుమును చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. కక్షిదారులు, సంబంధిత అధికారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

అక్రమ కట్టడం నిలిపివేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి - వడాలి రోడ్డులో సైడ్ డ్రెయిన్‌పై ఓవ్యక్తి కడుతున్న అక్రమ కట్టడాన్ని డ్రెయినేజీ, రెవెన్యూ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. బంటుమిల్లి రోడ్డులో ఉన్న మురుగుకాల్వపై అనుమతులు లేకుండా ఓవ్యక్తి అక్రమ కట్టడం చేపడుతున్నాడు. మురుగు బోదెను పూడ్చి వేసి మురుగునీరు పారుదల కాకుండా బోదెలో కాంక్రీటు వేసి పూడ్చి దానిపై శ్లాబ్ వేసే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బిజెపి నేత కె.కృష్ణ అధికారులకు సమాచారమిచ్చాడు. దీంతో డ్రెయినేజీ ఎఇ ప్రియదర్శిని, తహశీల్దార్ కె.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి యార్లగడ్డ శ్యాంసుందర్ ఘటన స్థలానికి చేరుకుని నిర్మాణాన్ని అడ్డుకున్నారు. రేపటిలోగా కట్టడాన్ని పూర్తిగా తొలగించాలని, లేనిపక్షంలో తామే తీసివేస్తామని హెచ్చరించి, నోటీసులు జారీ చేశారు.

గోరుముద్ద సరుకులు పక్కదారి

కలిదిండి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న జగనన్న గోరుముద్దలో అవకతవకలు చోటుచేసుకున్నాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందాల్సిన ఆహార నిర్వహణలో లోపాలు బయటపడ్డాయి. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, సర్పంచి మసిముక్కు మారుతీప్రసన్న, ఎంఇఒ ప్రభాకర్‌బాబు సంయుక్తంగా పాఠశాలలో తనిఖీ చేయగా మొత్తం 519 మంది విద్యార్థులకు 75 కేజీల బియ్యం వంట ఏజెన్సీ ఇచ్చినట్లు ప్రదానోపాధ్యాయులు చెప్పగా 30 కేజీలు వండినట్లు ఏజెన్సీ వారు చెప్పారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు స్వయంగా సుమారు 20 కేజీలు మాత్రమే వండినట్లు తేలిందన్నారు. మెనూ ప్రకారం చేసిన చింతపండు పులిహోరను విద్యార్థులకు వడ్డించగా 150 మంది విద్యార్థులకే వచ్చిందన్నారు. 450 గుడ్లు ప్రధానోపాధ్యాయులు ఇవ్వగా ఉడికించినట్లు తెలిపారన్నారు. వాటిని లెక్కిస్తుండగా వేరే బక్కెట్లో వేడి నీటిలో వేసిన సుమారు వంద గుడ్లు తీసుకురావడం జరిగిందన్నారు. అయినా వంద గుడ్లు వరకూ పక్కదారిపట్టించినట్లు తేలిందన్నారు. వండకుండా ఉంచిన బియ్యం, గుడ్లు ఎక్కడ ఉన్నాయని ఎంపిపి నిలదీయగా వేరే వ్యక్తి ద్వారా బయటకు పంపినట్లు తెలిపారన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

స్థానిక రైతుభరోసా కేంద్రం వద్ద మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు తాము పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని చెప్పారు. తేమశాతం 17 ఉంటే మంచిధర వస్తుందని రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ఆయన సూచించారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ పంటకాలంలో సుమారు ఐదు లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావొచ్చని జిల్లాయంత్రాంగం అంచనా వేసిందన్నారు. జిల్లావ్యాప్తంగా 261 రైతు భరోసా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా గుర్తించి అధికారులు సిద్ధం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, ఎంపిడిఒ ప్రేమాన్విత, తహశీల్దార్ ఎవి.రమణారావు, అగ్రికల్చర్ ఎఒ వెంకటేష్, స్థానిక నాయకులు మారడ మంగారావు పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ బిల్లుల చెల్లింపునకు చర్యలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

పోలవరం ప్రాజెక్ట్ సహాయ పునరావాసం(ఆర్అండ్ఆర్) కింద నిర్వాసితుల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపట్టాలని ఐటిడిఎ పిఒ, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం పోలవరం ఆర్అండ్ఆర్‌కు సంబంధించి వివిధ అంశాలపై పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య, ఇతర సంబంధిత అధికారులతో కలెక్టర్ ఆయా అంశాల వారీగా సమగ్రంగా చర్చించి వాటి తక్షణ పరిష్కారానికి దిశా, నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్అండ్ఆర్‌కు సంబంధించి ఐటిడిఎ పిఒ, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ వద్ద ఉన్న బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని, అదే విధంగా ఆప్షన్-2, 3 కింద ఉన్న బిల్లులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పోలవరం ప్రాజెక్ట్ కింద 41.5 కాంటూరుకు సంబంధించి 25 గ్రామాలకు చెందిన స్ట్రెక్చర్ల నిర్మాణాల పరిహారం సంబంధించిన రూ.13 కోట్ల బిల్లుల చెల్లింపుపై చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా 45.16 కాంటూరుకు సంబంధించి 16 గ్రామాలకుగాను మిగిలిన ఐదు గ్రామాల్లో ఎన్యూమరేషన్‌ను వచ్చేవారంలోపు పూర్తిచేయాలని ఆర్అండ్‌బి ఎస్ఇని కలెక్టర్ ఆదేశించారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో భూమి, ఆర్అండ్ఆర్‌కు సంబంధించి అందిన సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒను కలెక్టర్ ఆదేశించారు. పరిహారం చెల్లింపులో భాగంగా 948 మంది నిర్వాసితులకు చెందిన పాన్ కార్డుల కోసం సంబంధిత ఎంపిడిఒ, తహశీల్దార్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. రాజమండ్రి, పి.నారాయణపురం సంబంధించి భూ పరిష్కారంపై కేసుల వారీగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలన్నింటిలో పురోగతిపై వచ్చే మంగళవారం సమావేశం నాటికి స్పష్టత తీసుకురావాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశానికి విసిలో కెఆర్.పురం నుంచి ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ హాజరు కాగా పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌ఆదిత్య, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ సరళావందన, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ అద్దయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణరెడ్డి, ఝాన్సీరాణి, కలెక్టరేట్ ఎఒ రమాదేవి, తహశీల్దార్లు సుమతి, డిఎల్ ప్రమద్వర పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం గుత్తేదారు చేతివాటం

సరుకులు పక్కదారి - అడ్డుకున్న తల్లిదండ్రుల కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం సరుకులను గుత్తేదారు పక్కదారిపట్టిస్తూ జేబునింపుకుంటున్నాడు. ఈ క్రమంలో దొడ్డిదారిలో మధ్యాహ్న భోజనం సరుకులు తరలించేందుకు సిద్ధం చేయగా తల్లిదండ్రుల కమిటీ సభ్యులు గుర్తించి కంగుతిన్నారు. మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు వండిపెట్టాల్సిన మధ్యాహ్న భోజనం సరుకులు, కోడిగుడ్లు, రాగిపిండి, బియ్యం, కందిపప్పును దొడ్డిదారిలో తరలించడానికి వంటశాల వెనుక ప్రహరీ గోడ మధ్య దాచి పెట్టారు. దీన్ని గుర్తించిన తల్లిదండ్రుల కమిటీ సభ్యులు గుత్తేదారు సుబ్బారావును నిలదీశారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయురాలు లోవకుమారికి తెలిపారు. దీనిపై ఆమె మాట్లాడుతూ గుత్తేదారు సుబ్బారావుకు రోజువారీ రేషన్ సరుకులు కొలత ప్రకారం అందిస్తామని తెలిపారు. అయితే విద్యార్థులకు వండిపెట్టాల్సిన సరుకులను అసంపూర్తిగా వినియోగిస్తూ కొంతసరుకులను దాచిపెట్టినట్లు తెలిసిందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దాచిపెట్టిన సరుకులు

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

విజిలెన్స్ ఎస్‌పి కరణం కుమార్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్



మాట్లాడుతున్న విజిలెన్స్ ఎస్‌పి కరణం కుమార్

సమాజంలో ప్రభుత్వ పరిపాలనలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దామని విజిలెన్స్ ఎస్‌పి కరణం కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కార్పొరేషన్ సమావేశ మందిరంలో కమిషనర్ వెంకటకృష్ణ అధ్యక్షతన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలన, కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారితనం ప్రజలకు అందించే విధంగా ఉద్యోగులు కృషి చేయాన్నారు. 'అవినీతికి నో చెప్పండి... దేశానికి కట్టుబడి ఉండండి' అనే నినాదంతో సమాజాభివృద్ధికి ప్రతిఉద్యోగి తోడ్పడాలన్నారు. నీతి నిజాయితీతో కూడిన జీవనశైలిని అలవర్చుకునే విధంగా నేటియువతీ, యువకులకు తెలియజేయాలన్నారు. అనంతరం కమిషనర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు భద్రతతో కూడిన బాధ్యతగల విధులు నిర్వర్తించి ప్రజలకు ప్రభుత్వ సేవలందించాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా పరిపాలనలో భాగంగా క్రమశిక్షణ అలవర్చుకుని ప్రతిఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. సమాజంలో ఆర్థికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్యం వంటి విషయాలపై ప్రజలకు తెలియజేసి స్వచ్ఛ జీవనానికి, సమాజ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అవినీతిరహిత సేవలందించేందుకు, అవినీతి నిర్మూలనకు తీసుకునే నిర్ణయాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కమిషనర్ వెంకటకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డిఎస్‌పి ఎస్.వెంకటేశ్వరరావు, అడిషనల్ కమిషనర్ బాపిరాజు, ఎస్ఇ వెంకటేశ్వరరావు, భాస్కర్‌రావు, ఎంపిహెచ్ఒ డాక్టర్ మాలతి, డిఇలు, ఎఇలు, కార్పొరేషన్‌కు సంబంధించిన అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు.. ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాల కారణంగా కార్మిక హక్కులు హరించబడుతున్నాయని వీటికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఏలూరు నగర మున్సిపల్ కార్పొరేషన్ వద్ద ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎఐటియుసి స్తూపాన్ని కృష్ణచైతన్య ఆవిష్కరించారు. యూనియన్ పతాకాన్ని శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం కృష్ణచైతన్య, భజంత్రీ శ్రీనివాస్ మాట్లాడుతూ 103 సంవత్సరాల చరిత్ర కలిగిన ఎఐటియుసి నాయకత్వాన ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, ఆందోళనల ద్వారా కార్మికుల హక్కులు సాధించారన్నారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పర్మినెంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పతాకావిష్కరణలో నాయకులు

రాబోయే రోజుల్లో ఉద్యమం బలోపేతం చేసి కార్మికుల హక్కులకు పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు నాగబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు బంగారు దుర్గాప్రసాద్, జిల్లా ఆహ్వానితులు మాడుగుల జగదీష్, నగర కోశాధికారి కాసింకోట నాగేంద్ర, నగర కార్యవర్గ సభ్యులు అంతరాజు కిరణ్, గంట జానకిరామ్, వంశీ, గణేష్, సులేమాన్, రాజు, కిలారి వెంకన్నబాబు, బట్టు నాగబాబు, డి.రవీంద్ర, హరీష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

జాబ్ మేళాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి అధికారి సుధాకర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మోకాలుకు అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి - నూజివీడు రూరల్



మహిళను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ

ఏరియా ఆసుపత్రిలో తొలిసారిగా మంగళవారం మోకాలు, కీలు మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించారు. ఎముకల స్పెషలిస్టు డాక్టర్ ఎవిఆర్ మోహనరావు ఆధ్వర్యంలో చాట్రాయి మాణిక్యం(55) మహిళకు ఎడమ కాలు, మోకాలు, కీలు మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు మాణిక్యాన్ని పరామర్శించి వైద్యులను అభినందించారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - చాట్రాయి

నూజివీడు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య ఆదేశంతో యువకులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. గ్రామంలో ఆరుగొలను పేట గ్రామంలో ఆయన రాజకీయ రంగ ప్రవేశం చేస్తూ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో గ్రామానికి చెందిన యువకులు క్రికెట్ కిట్లు కావాలని అడగడం జరిగింది. ఆయనకు సంబంధించిన పలువురు నాయకులు మంగళవారం యువకులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ద్రోణం రాజు, శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి సభ్యులు అత్తునూరి సుబ్బారెడ్డి, గోళ్ల సురేష్,పాల్గొన్నారు.

ఘనంగా ఎఐటియుసి వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని మక్కినవారిగూడెంలో ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎఐటియుసి 104వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఎఐటియుసి పతాకాన్ని ఈడా పేరయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి చింతలపూడి ఏరియా ఉపాధ్యక్షుడు కొండముచ్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎఐటియుసి 1920 అక్టోబర్ 31న ముంబైలో ఆవిర్భవించిందని తెలిపారు. కార్మికులందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఠావర్కర్స్ యూనియన్ అధ్యక్షులు విసరపు రాము, కార్యదర్శి పాలకొల్లు గంగాధర రావు, కొప్పల సతీష్ పాల్గొన్నారు.

20న దళిత సేన మహాధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దళితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20వ తేదీన ఏలూరు కలెక్టరేట్ వద్ద జరగే దళిత సేన మహా ధర్నాను విజయవంతం చేయాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్ పిలుపు ఇచ్చారు. మంగళవారం స్థానిక దళిత సేన రాష్ట్ర కార్యాలయంలో మహా ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల రైతులకు పంచాయతీ తీర్మానం అవసరం లేకుండా అసైన్డ్ కమిటీ సమావేశం ద్వారా సాగు పట్టాలు మంజూరు చేయాలని, డప్పు కళాకారులు, చెప్పులు కుట్టే కార్మికులు, వికలాంగులను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దళిత సేన మహిళా అధ్యక్షురాలు జేబర జయసుధ పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఉక్కు మహిళ, భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 36వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు అధ్యక్షతన ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఆనాడు బ్యాంకులను జాతీయం చేసి దేశాభివృద్ధికి నాంది పలికారన్నారు. పేదలకు ఉచితంగా ఇండ్లు పంపిణీ చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దండుబోయన చంద్రశేఖర్, గౌడు రంగబాబూ, బ్లాక్ టూ ప్రెసిడెంట్ లంక రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న 170 క్వాటర్ల మద్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్ర శేఖర్ తెలిపారు. మంగళవారం ఎస్ఐ, సిబ్బందితో కలిసి దిబ్బ గూడెం పరిసర ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేస్తుండగా తెలంగాణ నుంచి దిబ్బగూడెం గ్రామానికి కొర్రి సుమతి అక్రమంగా మద్యం తరలిస్తుందని సమాచారం మేరకు దాడులు చేయగా ఆమె వద్ద వున్న సంచిలో మొత్తం 170 క్వాటర్ బాటిల్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యాన్ని స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి, మహిళను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడి

ముగ్గురు వ్యక్తులు అరెస్టు

ప్రజాశక్తి - చింతలపూడి

నాటుసారా స్థావరాలపై దాడులు చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు చింతలపూడి ఎస్ ఇబి సిఐ సుంకర సాయి స్వరూప్ తెలిపారు. చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో సెబ్ సిబ్బంది టి.నర్సాపురం, వల్లంపట్ల, కృష్ణాపురం గ్రామాలలో దాడులు జరిపి వల్లంపట్ల గ్రామానికి చెందిన పలగాని నాగేశ్వర రావు, నామవరం గ్రామానికి చెందిన ముడు బాలకృష్ణ అనే వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 12 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా నాగిరెడ్డి గూడెం, తెలేసోమవరం గ్రామానికి చెందిన గుడ్డేటి వెంకటేశ్వర రావు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల నాటు సారాను, ఒక మోటార్ సైకిల్‌ను సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడులలో చింతలపూడి సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని రాచన్నగూడెం పరిసర ప్రాంతాల్లో పోలీసులు వాహనాల తనిఖీలలో నాటుసారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెల్లవరం నిర్వాసిత కాలనీకి చెందిన కొవ్వాసి నాగేశ్వరావు, కొవ్వాసి పవన్ కుమార్‌లు తండ్రి కొడుకులిద్దరు వేరు వేరుగా సంచిలో మూడు లీటర్ల నాటుసారాతో పోలీసులను చూసి పారిపోవుచుండగా హెడ్ కానిస్టేబుళ్లు నాగేశ్వరావు, రాధాకృష్ణలు వారిని వెంబడించి పట్టుకొన్నారు. వారి వద్దనున్న ఆరు లీటర్ల నాటుసారాను సీజ్ చేసి, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అక్రమంగా నాటుసార విక్రయాలు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు చింతలపూడి సెబ్ ఇన్స్‌పెక్టర్ సుంకర సాయి స్వరూప్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలో మండలంలోని వల్లంపట్ల, కృష్ణాపురం గ్రామాల్లో సాయి స్వరూప్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించి 12 లీటర్లు నాటుసార, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మిర్చికి తెగుళ్ల బెడద

ఆవేదనలో రైతన్నలు

ప్రజాశక్తి - ముసునూరు

వలసపల్లిలో నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఆరుకాలం కష్టపడి పంటలు పండిస్తే తెగుళ్ల రూపంలో వచ్చి మిర్చి పంట రైతులను కష్టాలు పాలు చేస్తుంది. మండలంలోని వలసపల్లి, గుళ్లపూడి, గుడిపాడు, యల్లాపురం, బలివే గ్రామాల్లో సుమారు రెండు వేల ఎకరాల్లో మిర్చిపంట సాగుచేస్తుంటే ప్రతీఏటా బొబ్బర తెగులు, నల్లి పురుగు, తామర పురుగుల వలన ఆకు ముడుత, పూత రాలిపోవడం వంటి తెగుళ్ల వల్లన పంటలో దిగుబడి తగ్గిపోవడం రైతులను నష్టాల పాలు చేస్తుంది. ఎకరానికి పంట ఖర్చు సుమారు రూ.లక్ష వరకు ఇప్పటికే ఖర్చు కాగా, ఇప్పటి నుంచి కూలీల ఖర్చు కూడా అదనంగా పెరగడంతో ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. ఉద్యానవన శాఖాధికారులు పైన పేర్కొన్న గ్రామాల్లో ఏ గ్రామంలో కూడా సలహాలు, సూచనలు ఇవ్వడం లేదని వాపోతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఏ ఒక్క అధికారి రాలేదంటున్నారు. ఇప్పటికైన వారి సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

మిర్చిపంట అధిక దిగుబడి వస్తాదని ఆశతో కౌలు ఖర్చులు, వ్యవసాయ ఖర్చులు పెరిగినా ఎకరానికి కౌలు రూ.25 వేల నుంచి 35 వేలు, దుక్కులు ఖర్చు రూ.18వేలు, కూలీల ఖర్చు సుమారు రూ.39 వేలు, దుక్కులో ఎరువుల ఖర్చు రూ.20 వేలు, రసాయనిక ఎరువులు రూ.15 వేలు, క్రిమి సంహారక మందులు రూ.18 వేలు, మొక్కల నారు కొనుగోలుకు రూ.15 వేలు ఇలా పలు రకాలుగా పెట్టుబడి పెట్టి సాగు చేస్తూ, చివరికి ప్రకృతి వైపరిత్యాల వల్లన లేదా తెగుళ్ల వల్ల పూర్తిగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఉద్యానవన శాఖాధికారులు మాత్రం నిమ్మకు నిరెత్తన్నట్లు వ్యవహరించుతున్నారని రైతుసంఘం నాయకులు పెద్ద ఎత్తున వాపోతున్నారు. కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి, నష్టాలు రాకుండా ముందస్తుగా చర్యలు చేపట్టి తెగుళ్ల నివారణకు పిచికారీ చేసి, మందుల వివరాలు తెలియజేయాలని కోరుకుంటున్నారు. అదేవిధంగా పూర్తిగా నష్టపోయిన పంట పొలాలను నమోదు చేసి, నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ నర్సింహా కోరారు.

పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నాం

పామర్తి శ్రీనివాస్, కౌలురైతు



నేను నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని గత 15 సంవత్సరాల నుండి మిర్చిపంట సాగు చేస్తున్నాను. గత ఏడాది నల్లి పురుగు, తామర పురుగు వల్ల పంట ముడత తెగులు వచ్చి పూర్తిగా నష్టపోయాం. ఈ సంవత్సరం బొబ్బర తెగులు వచ్చి పంట మొత్తం పూర్తిగా ముడత రావడంతో దిగుబడి తగ్గిపోతుంది. ఎకరానికి కౌలు రూ.30 వేలు కట్టి పెట్టుబడులు రూ.లక్ష ఖర్చు చేసి పంట కాపుకోచ్చే సమయానికి ఇలా నష్టపోతున్నామన్నారు.

నిరుడు నల్లి పురుగు, నేడు బొబ్బర తెగులు

సుదగాని రాము, రైతు

నేను నా భార్య కలిసి వేరే పనులకు కుడా వెళ్లకుండా నాకున్న ఎకరం నర్ర పోలంలో మిర్చి పంట సాగు చేస్తున్నాం. నిరుడు నల్లి పురుగు తెగులు, ఈ ఏడు బొబ్బర తెగులు రావడం ఇలా పలు కారణాలతో సుమారు రూ.70 వేలు పూర్తిగా నష్టపోయే పరిస్థితుందన్నారు.

పూత రాలిపోతుంది

గొల్లపల్లి బాలస్వామి, కౌలు రైతు

మాది వలసపల్లి గ్రామం నేను రెండు ఎకరాలు కౌలు, ఎకరానికి కౌలు రూ.29 వేలు కట్టి మిర్చి పంట సాగు చేస్తే బొబ్బర తెగులు రావడంతో ఆకు మొత్తం పూర్తిగా ముద్చుకుపోయి పూత రాలిపోతుంది.

పామాయిల్ ఫ్యాక్టరీ కాలుష్యాన్ని అరికట్టాలి

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని ఉప్పల మెట్ట సమీపంలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని అరికట్టాలని వార్డు కౌన్సెలర్ ఇందిరా ప్రియదర్శిని కోరారు. మంగళవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ పామాయిల్ ఫ్యాక్టరీ విడుదల చేస్తున్న వ్యర్థాల వల్ల ఉప్పల మెట్ట పరిసర ప్రాంతాలలో తాగునీరు కలుషితం అవుతుందని తెలిపారు. వాయు కాలుష్యంతో పాటు తాగునీటి కాలుష్యం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మున్సిపాలిటీ నుంచి పామాయిల్ ఫ్యాక్టరీకి ఇచ్చే అనుమతులను నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఇ.భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.

60 మంది విద్యార్థులు రక్తదానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాల, సిజిఎస్‌టి ఏలూరు డివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించిన రక్తదాన శిబిరంలో 60 మంది విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. ఏలూరు డివిజన్ సిజిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ బాల నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు రక్తదానం వంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా భాగస్వాములు కావాలన్నారు. తద్వారా విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఆదిత్య కళాశాల ప్రిన్సిపల్ మార్గాని శ్రీకాంత్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో తమ కళాశాల విద్యార్థులు ముందుంటారన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లోకేష్, పిఆర్‌ఒ కెవి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు నూజివీడు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని విక్టోరియా టౌన్ హాల్ క్రీడా ప్రాంగణంలో శిక్షణ పొందిన ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయిలో బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పిడి, సీనియర్ కోచ్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ పట్టణ ప్రముఖులు, క్రీడాభిమానుల ప్రోత్సాహంతో ఉత్సాహవంతులైన విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జాతీయస్థాయి విజేతలుగా నిలిచి బంగారు భవిత సొంతం చేసుకోవాలని సూచించారు.

3న విద్యా సాఫల్య సర్వే పరీక్ష

భీమడోలు : విద్యార్థులలో అభ్యాసనా సామర్థ్యాల పరిశీలనకు దేశవ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా సాఫల్య సర్వే పరీక్షలను ఈనెల 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి-2 భాస్కర్ తెలిపారు. 3, 6, 9 తరగతులకు పరిమితం చేసిన పరీక్షల్లో భాగంగా మండల పరిధిలోని ఐదు పాఠశాలల సముదాయాల పరిధిలోని 44 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా పరీక్షా కేంద్రాల్లో పరిశీలకులుగా వ్యవహరించేందుకు ఎంపిక చేసిన భీమడోలు శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులకు మంగళవారం కాలేజీ ఆవరణలో శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శిక్షణా తరగతులకు కోర్సు డైరెక్టర్‌గా మండల విద్యాధికారి-1 ఇ.శ్రీనివాసరావు వ్యవహరించారు. తెలుగు, ఇంగ్లీషు, లెక్కల సబ్జెక్టులలో పరీక్షలను కంప్యూటర్ ఒఎంఆర్ విధానములో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు, సత్యప్రసాద్, రమణ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

కాంతారావుకు ఆర్ట్ గెలాక్సీ అవార్డు

ఏలూరు అర్బన్ : ప్రముఖ చిత్ర కళాకారులు, ఏలూరు నివాసి మజ్జి కాంతారావుని ఒంగోలుకు చెందిన ప్రముఖ చిత్రకళా సంస్థలు సృష్టి ఆర్ట్ అకాడమి ఆధ్వర్యంలో 2023 సంవత్సరానికి గాను ఆర్ట్ గెలాక్సీ అవార్డుతో సత్కరించారు. అక్టోబర్ 29వ తేదీన ఒంగోలులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లోన జరిగిన ఒంగోలు ఆర్ట్ ఫెస్టివల్ కార్యక్రమంలో చిత్రకళ రంగంలో విశిష్టమైన ఖ్యాతిని పొందిన మజ్జి కాంతరావు ఈ అవార్డు పొందడం పట్ల ఏలూరు ఆర్ట్ సొసైటీ, హిందూ యువజన సంఘం, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పోలీస్ స్టేషన్‌ని సందర్శించిన రాజేంద్రనాథ్ రెడ్డి

కొయ్యలగూడెం : ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రాజేంద్రనాథ్ రెడ్డి కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్‌ని సందర్శించారు. జిల్లా ఎస్పి మేరీ ప్రశాంతితో కలిసి వార్షిక తనిఖీలలో భాగంగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉద్యాన పంటల రైతులకు రాయితీలు

కొయ్యలగూడెం : రానున్న కాలం ఉద్యాన పంటల వ్యవసాయం చేసే రైతులదేనని ఉద్యాన శాఖ అధికారి ధీరజ్ లక్ష్మణ్ పేర్కొన్నారు. అంకాల గూడెంలోని భోగి లింగేశ్వర రైతు ఉత్పత్తిదారు సొసైటీ భవనం వద్ద నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుతం ఉన్న వాణిజ్య పంటలకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలు వేసేందుకు ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తుందని, దానిని సద్వినియోగం చేసుకుని రైతులు లబ్ధి పొందాలని తెలిపారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

ప్రజాశక్తి - పోలవరం

ఉక్కుమనిషి, దేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.శ్రీను అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ దేశ సమగ్రత, పరిరక్షణకు కృషి చేస్తామని జాతీయ ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను మనం గుర్తుంచుకోవాలని, జాతీయ సమగ్రత పట్ల ఆయన నిబద్ధత మనకు మార్గనిర్దేశం చేస్తుందని ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, ఎఒ సిహెచ్.శ్రీనివాస బాబు, ఎపిఒ వెంకటేశ్వరరావు, భరత్, మండల పరిషత్ సిబ్బంది, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలోని పలు గ్రామాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం పురస్కరించుకొని జాతీయ ఐక్యత దినోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా పలు పాఠశాలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సత్కరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. పురవీధులలో ఐక్యతా ర్యాలీలను నిర్వహించారు. అన్నేవారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మస్తాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు.

నూజివీడు రూరల్ : మండలంలోని బోరవంత గ్రామంలో సచివాలయం ఆవరణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యత దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి కుంతొం ఉదయ్ రాజు మాట్లాడుతూ ఉక్కు మనిషిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ సమైక్యతకు ఎంతో పాటుపడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఐ.రామకుమారి, వాలంటీర్లు నాగరాజు, జియావుద్దీన్ ఖాదిరి, స్టాలిన్ పాల్గొన్నారు.

ముసునూరు : స్థానిక భారతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకొని జాతీయ ఐక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.శౌరీ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

జీలుగుమిల్లి : సర్దార్ వల్లభాయ్ పటేల్ పరిపాలనా దక్షత, దేశభక్తి, క్రమశిక్షణను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సతీష్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆంజనేయులు, రాజేష్ పాల్గొన్నారు.

టిడిపి నేతల సంబరాలు

చాట్రాయి : రాష్ట్రంలో నిజం గెలవడం మొదలైందని జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాస రావు ఆనందం వ్యక్తం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో 53 రోజులుగా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న చంద్రబాబుకి హైకోర్టులో నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు కావడం పట్ల మంగళవారం చాట్రాయి మండలం, చనుబండ గ్రామం సెంటర్‌లో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కమ్మిలి కొండలరావు, రాయవరపు పుల్లారావు, పలగాని లక్ష్మీనారాయణ, అంబటి సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమడోలు : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు మధ్యంతర బెయిల్ మంజూరు కావటం పట్ల ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో కార్యకర్తలు స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుకు బెయిల్ రావటం రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి సంకేతంగా అభివర్ణించారు.

పోలవరం : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వడం పట్ల పోలవరం మండలం తెలుగు తమ్ముళ్లు హర్షం వ్యక్తం చేశారు. బెయిల్ వార్త తెలిసిన వెంటనే మండల పరిధిలోని నాయకులందరూ సెంటర్‌లోకి వచ్చి ఆనందోద్రేకంతో బాణాసంచాలు కాల్చి, స్వీట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డు కృష్ణ, నునకాని రాంబాబు, పోతుల శ్రీనివాసరావు, కుంచె దొరబాబు, రెడ్డి మురళి, నౌడు నాగేశ్వరరావు, ఇల్లా రంగారావు పాల్గొన్నారు.

చింతలపూడి : టిడిపి అధినేత చంద్రబాబును ఎన్ని ఇబ్బందులు పెట్టాలని చూసినా చివరకు న్యాయమే జరుగుతుందని టిడిపి మండల కార్యదర్శి కోండ్రు దేవా అన్నారు. చంద్రబాబు క్షేమంగా బయటకు వచ్చిన సందర్భంగా స్వీట్లు ఒకరికొకరు తినిపించుకుంటూ బాణాసంచా వెలిగించి ఆనందోత్సవాలు జరిపారు. ఈ కార్యక్రమంలో కోప్పుల నాగరాజు, ధారా విరేంద్ర, మహలక్ష్ముడు పాల్గొన్నారు.

ముదినేపల్లి : చంద్రబాబునాయుడుకు మధ్యంతర బెయిల్ వచ్చిన సందర్భంగా ముదినేపల్లిలో యువనేత కొడాలి వినోద్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి హైకోర్టు మంగళవారం మధ్యాహ్నం బైలు మంజూరు చేసిన సందర్భంగా టిడిపి నేతలు ఆనందం వ్యక్తం చేశారు. నిజమే గెలిచింది అంటూ నినాదాలు చేశారు.

కలిదిండి : చంద్రబాబు నాయుడుకు మధ్యంతర బెయిల్ మంజూరైన సందర్భంగా మట్టగుంటలో రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి టిడిపి శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు. టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి పాల్గొన్నారు.

ముసునూరు : నారా చంద్రబాబునాయుడు బెయిల్‌పై విడుదలైన సందర్భంగా మంగళవారం రాత్రి మండలంలోని 16 గ్రామాల్లో టిడిపి నాయకులు గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున బాణాసంచి కాల్చి, ఆనందంతో స్వీట్లు, కేకులు గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గద్దె రఘుబాబు, కొల్లి గంగారామ్, మందలపు ధర్మరాజు, గద్దల సుహాసిని మోహన్ రావు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వర కళాశాలలో 'రన్ ఫర్ 4.0'

భీమడోలు : శ్రీవెంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగపు వాలంటీర్లు మంగళవారం క్విట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా రన్ ఫర్ 4.0 నిర్వహించినట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాల కేంద్రంగా నిర్వహించిన కార్యక్రమంలో సుమారు వంద మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని పురవీధుల్లో ఆరోగ్య పరిరక్షణ గురించి వివరించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త శశికాంత్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ యువతలో ఆరోగ్య పరిరక్షణ, నైపుణ్యాభివృద్ధి కోసం రన్ ఫర్ 4.0 కార్యక్రమాన్ని 2019వ సంవత్సరంలో ప్రారంభించారని, దీని కొనసాగింపులో భాగంగా భీమడోలు కళాశాలలో కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ భవాని సింగ్, కళాశాల ఎన్‌సిసి అసోసియేట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కె.శివశంకర్, జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవల పరిశీలన

ప్రజాశక్తి - భీమడోలు

ప్రజలకు అందుతున్న వివిధ ఆరోగ్య సేవల పరిశీలనకు జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల కమిటీ మండలంలో మంగళవారం పర్యటించిందని గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఒ ఒ.అన్నపూర్ణ తెలిపారు. దీనిలో భాగంగా కమిటీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని భీమడోలు గ్రామ సచివాలయం-1 ఆవరణలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిందన్నారు. రికార్డులు పరిశీలన, రోగులు పొందుతున్న సేవలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారన్నారు. వీరు ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్ కాలం రోగులకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ఇదే క్రమంలో వీరి పర్యటన విశేషాలు వైద్యశాఖ పరంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇచ్చే శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు సహాయకారిగా ఉంటుందని తెలిపారు. ఇదేవిధంగా గుండుగొలను గ్రామంలో జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు ఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచి కె.లక్ష్మి పాల్గొన్నారని తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిరక్షణ గురించి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారని తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గొల్లపల్లి విద్యార్థిని ఎంపిక

నూజివీడు రూరల్ : మండలంలోని గొల్లపల్లి గ్రామంలో శ్రీఅన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లి విద్యార్థిని ఎమ్.మేఘున రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుని దుర్గా మల్లేశ్వరి తెలిపారు. మంగళవారం గుడివాడ పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన జూనియర్ కబడ్డి సెలక్షన్‌లో ఎంపికైందని తెలిపారు. నవంబర్‌లో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. అనంతరం వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరక్టర్ రవీంద్రను, క్రీడాకారిణిను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహనరావు, పుల్లారావు, మనోహరం, బాలు, కోటేశ్వరమ్మ, సౌజన్య, సాకా రవి, నాన్ టీచింగ్ సిబ్బంది, శ్రీనారాయణ, మరియమ్మ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కౌన్సిల్లో టిడిపి నేతల డిమాండ్

నూజివీడు రూరల్ : పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం మంగళవారం ప్రారంభమైంది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కౌన్సిల్ సభ్యులు చర్చ కొనసాగించారు. పట్టణంలో తాగునీటి వ్యవస్థ సరిగా లేదని, ప్రజలకు నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని టిడిపి ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అవసరాల మేరకు తాగునీటిని సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

NOTICE
In The Court Of The Vth Addl. Junior Civil Judge :: Kakinada
O.S.No. 589/2023
Between:
Pachipala Rajesh ...*Plaintiff*
AND
Rangisetti BandiMutyalu ...*Defendant*
To: The Defendant:
Rangisetti Bandimutyalu, S/o. Srinu, D.No. 4-45, Yalla Vari Meraka, Kummarapurugu Palem, Mogalaturu, W.G.Dist-534280.
Whereas the above named plaintiff filed the above numbered case against the defendant for recovery of the pronote suit amount. Therefore you are hereby summoned to appear before the **Hon'ble Court on 14-11-2023 at above 10:30 A.M.** either in person or through Vakil and File your objections if any. Failing which, the matter will be decided in your absence making you Expartee.
//By Orders Of Court//
KOMMANTI DINAKAR
Advocate for Plaintiff, Kakinada, Cell: 94418 57336

డాక్యుమెంట్సు పోయినవి
పశ్చిమ గోదావరి జిల్లా, తాడపల్లిగూడెం మండలం, ఉప్పరగూడెంకి చెందిన టి.నాగమణి, భర్త: లేటు వీరరాఘవులు అను నాయొక్క డాక్యుమెంట్సు పోయినవి. ది. 16-10-2023వ తేదీన గొల్లవానితిప్పలో ఆటో ఎక్కుచుండగా నాయొక్క ఒరిజినల్ పోస్టల్ ఎఫ్.డి. బ్యాంకు ఎఫ్.డి. బ్యాంకు సేవింగ్స్ బుక్, లాకర్ కీస్, నా ఒరిజినల్ ఆధార్ కార్డు పడిపోయినవి. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకి తెలియజేయగలరు.
టి.నాగమణి
భర్త: (లేటు) వీరరాఘవులు
ఉప్పరగూడెం, తాడేపల్లిగూడెం మండలం, ప॥గో॥జిల్లా. సెల్: 93985 95489

In the Court of the Senior Civil Judge, Tanuku
E.P. No. 7/2023 in O.S. 64/2018
DHR/ Plaintiff:
Nammi Dhana Lakshmi
JDR/ Defendant:
Yavvari Sanyasi Rao
JDR: Yavvari Sanyasi Rao, S/o. Surya Rao, Residing at Tandra Savitramma, D.No. 8-62, Rangapuram Colony, Korukollu.
పై నెంబర్ గ్రంధములో DHR తనఖా బాకీ రాబట్టుకొనే నిమిత్తం E.P దాఖలు చేయగా JDR అయిన Yavvari Sanyasi Rao గారు Sale Notice తీసుకొనకుండా Evade చేయుచున్నందున **ది. 17-11-2023వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు కాని యెడల పరోక్షమందు తీర్మానించబడును.
Tanuku 27-10-2023 **D.RADHA** Advocate, Tanuku

In The Court Of The Principal Junior Civil Judge Court :: Tanuku
O.S.No. 117/2020
Between:
Meka Venkateswara Rao ...*Plaintiff*
AND
Chunchula Rama Krishna ...*Defendant*
వాది తరుపున చేసిన ప్రకటన
ప్రతివాది: చుంచుల రామకృష్ణ, తండ్రి: లేటు సత్యం, హిందువు, పురుషుడు, 58 సం॥లు, డో.నెం.4-130(2), తేతలి గ్రామం, తణుకు మండలం.
పై నెంబరు దావా గ్రంధములో మీరు ప్రతివాది అయి ఉన్నారు. మరియు ఐ.ఎ.నెం. 354/2020 నందు రెస్పాండెంటు అయి ఉన్నారు. పై నెంబరు దావా గ్రంధము మరియు ఐ.ఎ.354/2020 నందు శ్రీ కోర్టు వారి ఆదేశం ప్రకారం ఎన్నిసార్లు సమన్లు మరియు నోటీసులు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశం ప్రకారం ఈప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా ఈ ప్రకటన ప్రచురితమైన **తేదీ నుండి 30 రోజులలోగా** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు ఎదుట హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేయవలసిందిగాను అట్లు కాని ఎడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.
NEELAM HARISH NAIDU
Advocate, D.No.30-4-8, Behind Lakshmi Theatre, Tanuku.
Cell: 92932 22187